
# కుటుంబం

## జలంధర



"ఎ రేస్ హార్స్ ఈజ్ యాన్ ఎనిమల్ దట్ కెన్ టేక్ సెవరల్ థౌసండ్ పీపుల్ ఫర్ ఎ రైడ్ ఎట్ ది సేమ్ టైమ్"

హాల్లో మామగారికి ఇష్టమైన రేసుగుఱ్ఱం ఫోటోకింద ఈ కొటేషన్ చదివి, "రేసు హార్సేకాదు ఈ ఇండియాలో కుటుంబవ్యవస్థ కూడా ఇంతే..." విసుగ్గా అనుకున్నది సృజన.

సృజన అమెరికాలో పుట్టి పెరిగింది... అక్కడ పారాసైకాలజీ క్లాసులు, యూనివర్సిటీ ఆఫ్ అగ్నిహోత్రా... వీటన్నింటి గురించి తెలుసుకుంటూ, దీపక్ చోప్రాను ఆరాధించేస్తూ పెరిగింది... అన్ని చోట్లా ప్రతి గొప్ప ప్రొఫెసరూ ఇండియా పుణ్యభూమి అని అక్కడి మట్టికి కూడా డివైన్ వైబ్రేషన్ ఉంటుందని చెప్పేవాళ్ళే. అందుకనే ఇండియాలో ఉండే అబ్బాయినే పెళ్ళి చేసుకుంటాను అని పట్టుపట్టింది.

మంచి కుటుంబం... అబ్బాయి కంప్యూటర్స్‌లో ఉన్నాడు. చూడ్డానికి బావుంటాడు. ఆస్తి ఏదో ఉన్నది... సుందర్ సంబంధం ఈవిధంగా తెలిసింది.

"ఇంకా పది పదిహేనురోజులు ఆగి... వాళ్ళగురించి తెలుసుకుని... " ఆలోచిస్తూ అన్నాడు తండ్రి.

"అర్థం లేదు ఆమాటకు... మనం వెళ్ళి ఒక వారం రోజులు వాళ్ళింట్లో ఉన్నా అంతా ఇంప్రెసివ్‌గా ప్రవర్తిస్తారు. అది అక్కడ కల్చరు...

పిల్లను ఇచ్చి చెయ్యదలుచుకుంటే తనకు ఈ సమస్యలను వీలైతే అర్థం చేసుకుని, వీలుకాకపోతే అడ్జస్టు అయి... మరీ తప్పనప్పుడు జాగ్రత్తగా ఆ పరిస్థితుల్ని మార్చి... ఈ గందరగోళంలో తను డిప్రెషన్‌లోకి వెళ్ళిపోకుండా... ఇవన్నీ నేర్పించి పంపించాలి... అంతే. సృజనా అడుగువేసేముందు నువ్వే ఆలోచించుకో" వార్నింగ్ ఇచ్చింది తల్లి.

ఇరవయ్యవఏటే అమెరికా వెళ్ళిపోయి అక్కడే ఉండిపోయిన తండ్రికి, ఆంధ్ర దేశం

అమెరికా వెళ్ళిన తల్లికి చాలా తేడా వున్నది.

"అయ్యబాబోయ్... ఏమిటమ్మా అలా భయపెడతావు... నేను పెళ్ళి చేసుకుంటాను అన్నాను కానీ సైకోథెరపిస్టు ఉద్యోగానికి వెళతాననలేదు... సరేనా" నవ్వుతూ అన్నది సృజన.

"అమ్మ ఎప్పుడూ అంతేలే..." అన్నాడు తండ్రి... పెళ్ళయిపోయింది.

"సృజనా! నువ్వు అమెరికా పెంపకం, ఇండియా ఆలోచనల కాంబినేషన్ నాకు ఇండియాలో ఉన్న అబ్బాయి కావాలన్నావు... కానీ అతను తప్పకుండా అమెరికా వచ్చెయ్యాలనే అనుకుంటాడు. ఇండియాలో అంతా పొద్దున్నే లేచేసి ప్రాణాయామం, యోగాచేస్తూ, చాలా షార్ప్‌గా ఆలోచిస్తూ, ఐడియల్ వర్క్ స్పాట్‌లో, వర్క్ శాటిస్‌ఫాక్షన్‌తో వుంటారని అనుకోకు. ఇక్కడ చెప్పే శాంతి, తృప్తి, కర్మయోగం మనకు ఇండియన్ స్టాల్‌లో ప్రదర్శించే అపురూప వస్తువులు... అవి అన్ని చోట్లా ఊరికే దొరుకుతాయి అనుకోకు.

ఇండియాలో ప్రతి అబ్బాయి మీద కుటుంబ ఛాయ ఉంటుంది. కులం నీడ వుంటుంది. అతను మనిషిగా వేరు. కుటుంబంలో వ్యక్తిగా వేరు. ఇది ఈ మార్పు చాలా కనీకనపడనట్లుంటుంది. సుందర్ నువ్వు విడికాపురం పెట్టడానికి మూడు నెలలు టైం ఉన్నది కాబట్టి బాగా స్టడీ చెయ్యి..." ఇది తల్లి ఉత్తరం.

అత్తగారింట్లో అడుగుపెట్టిన ఒకవారందాకా ఏదీ అర్థంకాలేదు సృజనకు... అంతా గందరగోళమే... 'అమెరికా అమ్మాయిని కాబట్టి కాంప్లెక్స్‌తో ఆలోచిస్తున్నానా!' అని తనను తాను ప్రశ్నించుకున్నది.

అన్ని రకాల సౌకర్యాలు ఉన్న ఆ ఇంట్లో ఇరవై నాలుగుగంటలూ టెన్షన్... జీతాలు తీసుకునే పనివాళ్ళ దగ్గరనుంచి ఏ ఒక్కరికీ ఆ ఇంటిమీద ప్రేమా, అభిమానమో, గౌరవమోలేదు. టీలు తాగుతూ తోటలో కూర్చుని పనివాళ్ళు యాజమానులగురించి మాట్లాడుకునే మాటల్లోనే చాలా చాలా విషయాలు తెలిశాయి సృజనకు.

"చూడమ్మా! సంపాదించాలి... హాయిగా వాడుకోవాలి.... ఎవరి రెక్కలు... వాడికి ఇచ్చాను... పక్షిచూడు... రెక్కలు వచ్చేదాకానే గూడు... ఆతరువాత బలవంతంగా బిడ్డను బయటకు తోసేస్తుంది. నా విషయం అంతే. ఎవరి ఈత వారిదే. ఈత నేర్చుకోకుంటే మునిగిపోతాడు. అంతే... అమెరికాలో ఉండివచ్చావుకదా... అక్కడ ఎకానమీ అంతా క్రెడిట్ బేసిస్... ఇక్కడ ఆస్తులు చేర్చి, కక్కుర్తి బతుకులు బతికి పిల్లలకు అందివ్వాలనే వెధవ ఆలోచనే ఈ దేశాన్ని పాడుచేస్తోంది. పొదుపు అనే మాటకు అర్థం



తెలియని మామగారు జీవిత సత్యాలు ఈరకంగా చెప్పేశారు. మరి ఇంక ఆయనకు ఇన్‌స్టాల్‌మెంట్ మీద హోండా కారెందుకు? ఆ ఖరీదైన క్లబ్బుల్లో మెంబర్‌షిప్ ఎందుకు? క్రెడిట్ కార్డ్స్ మీద అంతంత అప్పులేమిటి? అని ఎవరు అడగగలరు? ఆయన సంపాదిస్తున్నాడు... ఇంటి యజమాని. ఆయనను ప్రశ్నించకూడదు.

"మెగావాళ్ళు దుబారా చేస్తూ ఉంటారు. మనమే జాగ్రత్త పడాలి. నీ తోడికోడళ్ళిద్దరి బ్యూటీ పార్లర్ల ఖర్చులు, చీరల ఖర్చులు, షాపింగ్ ఖర్చులు చెపితే నీకు గుండె ఆగిపోతుంది... నా బిడ్డలు రెక్కలు ముక్కలు చేసుకుని సంపాదిస్తే వీళ్ళు ఈరకం ఇంట్లో ఎన్నైనా ఒండిపెట్టు... ఆట్మాస్ఫియర్ అంటూ... హోటలుకు పోతారు. డబ్బులు పెట్టి తింటేకానీ మనశ్శాంతి ఉండదు కాబోలు..."

ఇది అత్తగారి ఉవాచ... ఈవిడ పొదుపు ఏమిటా అని గమనించింది సృజన... ఆవిడ కక్కుర్తి, రేషనింగు, వంట దగ్గర, పనివాళ్ళ దగ్గర ఏది సుఖంగా ఉన్నా లేకపోయినా ఆవిడ నెలనెలా చీటీలకు డబ్బులు ఉండాలి.

"నేను కాబట్టి ఈసంసారాన్ని లాక్కొస్తున్నాను కానీ..." అంటూ ప్రతి విషయంలోనూ అందర్నీ తప్పుపడుతూ, తిడుతూ, గందరగోళంగా తయారుచేస్తుంది ఇంటిని.

తల్లి ఫోన్ చేసినప్పుడు -

"ఈవిడ ఏమిటమ్మా! ఇలా?..." అని అడిగేసింది.

నవ్వేసింది తల్లి... అతి మామూలు ఆడపిల్లలా మొట్టమొదటి కంప్లైంట్ అత్తగారిమీద ప్రారంభించావా? ఇవన్నీ ఈగద్దరితనాలన్నీ పైపైన కనపడే లక్షణాలు... ఆవిడ సుఖంగాలేదు. ఇంకా కొంచెం గమనించు" చెప్పింది తల్లి.

## తాటాకు మంటలు

బాలీవుడ్‌లో స్నేహాలు, బంధుత్వాలూ, విరోధాలు ఏవీ ఎక్కువ కాలం కొనసాగవు. నిన్న ఒకరి నొకరు విమర్శించుకున్నవారే, నేడు మిత్రులైపోతారు. ఆ మధ్య రామ్ గోపాల్ వర్మ, మనోజ్ బాజ్ పేయ్‌లు, ఒకరినొకరు విమర్శించుకున్నారు. ఇప్పుడు మరలా మంచి మిత్రులై పోయారట ! రామ్‌గోపాల్ వర్మ తాజాగా నిర్మించే చిత్రంలో ఊర్మిళతో బాటు, మనోజ్ బాజ్ పాయ్‌ని కూడా బుక్ చేసారట !

అలాగే ఈ మధ్య అజయ్ దేవగన్, అతడి తండ్రి వీరూ దేవగన్‌లు గొడవ పడ్డారట ! అయితే అజయ్ తండ్రికి క్షమాపణ చెప్పడంతో, వారిద్దరూ మళ్ళీ కలిసిపోయారట !


నిజమే అది.... ఆమెకు ఇరవై నాలుగుగంటలూ డబ్బుపోతుందన్న టెన్షనే. పైసాపైసా దాచే ఇంటినుంచి వచ్చిన ఆమెకు తన కంట్రోలు దాటిపోతున్న ఈఇంట్లో అన్నీ భయాలే. డ్రైవర్, వాచ్‌మెన్ వాళ్ళ జీతాలు, బక్షీలు అయ్యగారు ఇస్తారు కాబట్టి ఉంటున్నారు కానీ అమ్మగారు జీతాలు ఇచ్చే పనిమనిషి మూడు వారాలకొకసారి మారిపోతుంది.

పనిమనిషి రానిరోజు ఆఇల్లు రణరంగమే.... గిన్నెలు ఎత్తి పడేసి సోఫాలు చిందరవందర చేసి, ఒకళ్ళనొకళ్ళు తిట్టుకుని చాలా డిసిప్లెన్డ్ వాతావరణం నుంచి వచ్చిన సృజనకు ఎందుకో ఇదంతా అర్థంకాలేదు.

ఆదివారం అందరూ పిక్నిక్ అని వెళుతుంటే "సుందర్ కాంప్ నుంచి వస్తాడు నేను ఉండాలి" అని తప్పించుకుని, పనిమనిషిని పంపించేసింది. ఒక్కసారి ఇల్లంతా తిరిగి పనులు ఏమేమి ఉన్నాయో చూసుకుని, ప్లాన్ చేసుకుని, టైం చూస్తూ పూర్తి చేసింది. ఒక్క పడకగదులు సర్దడం తప్ప అంతా రెండు గంటల్లో అయిపోయింది. కానీ, అటకల్లో చెత్త, వంటింటి టైల్స్, బాత్‌రూం టైల్స్, తోటలోకుప్ప, వాల్ హంగర్స్ మురికి ఇవి ఒక్కరోజులో పోవు.

"పని చెయ్యలేకకాదు. చేతకాకాకాదు. దాన్ని గురించిన ఆలోచన, యాటిట్యూడ్ కారణం. ఇది మనందరం హాయిగా ఉండవలసిన చోటు. ఇది పద్ధతి, ఇది అవసరం అనుకోరు. ఇది ఖర్మ తప్పనిసరి శిక్ష అనుకుని చేస్తారు. అదీ సమస్యలకు కారణం...." తల్లి ఫోన్లో వివరించి చెప్పింది.

"అమ్మో... ఇన్ని డిగ్రీలు, డిప్లొమాలు చేశారా? మరి ఉద్యోగం ఎందుకు చెయ్యరు రాధా!" అయిదువందలు అడ్జస్ట్‌మెంట్‌కోసం వచ్చిన చిన్న తోడికోడల్ని అడిగింది ఆశ్చర్యంగా సృజన.



"ఎందుకు ఉద్యోగం! ఈ ఇంటి మొగపిల్లల్ని కొంచెం కూడా డిసిప్లెన్డ్‌గా పెంచలేదు ఈ తల్లీ తండ్రి. నేను సంపాదించేది మళ్ళీ మా ఆయన ఖర్చులు, ఇంటి ఖర్చులు అని పులుసులో పడేస్తారు. విడిగా ఉండటానికి ఒప్పుకుంటే అప్పుడు ఉద్యోగం చేస్తాను. ఈఇంట్లో వాళ్లను బాగుచెయ్యడానికి నేనేం కష్టపడఖ్ఖర్లేదు. ఆఫీసునుంచి వస్తే ఇంట్లో చక్కగా, హాయిగా ఉండాలి. ఇల్లంటే ఈనరకమా? దీనికి నేనుకూడా కష్టపడడం ఎందుకు?"

"అయినా అన్ని గోల్డ్‌మెడల్స్ ఉండి..."

కన్నీళ్ళు తిరిగాయి రాధకు.

"ఉంటే ఏమిటి ఉద్ధరింపు సృజనా... నా చదువు, నా అందం, నా బారెడు జుట్టు కట్నంలో, పెట్టుపోతల్లో, సారెలో కనీసం యాభైవేలు తగ్గించలేకపోయాయి. మూడు లక్షలు ముక్కుపిండి వసూలు చేశారు మా నాన్న దగ్గర. మా నాన్న ఇంకా అప్పులు, వడ్డీలు కడుతూనే ఉన్నాడు. పోనీ నాకు ఆయన చెప్పించిన చదువే కదా అని ఉద్యోగం చేసి తీర్చుదామంటే నా జీతం పుట్టింటివాళ్ళకు పైసా పెట్టకూడదట అత్తగారి ఆర్డర్" ఆవిడను ఎదిరించలేక 'అమ్మ ఏమంటే అది చెయ్యి' అని తప్పించుకుంటాడు నా మొగుడు.

నా పెళ్ళి గిఫ్ట్ అన్నీ మా వాళ్ళకు ఒక్కటీ ఇవ్వకుండా మూటలు కట్టించి అమ్మించింది ఈ మహాతల్లి. నాకు వచ్చిన పెట్టుబడి చీరలు, జాకెట్లు దగ్గరనుంచి 'మనం బోలెడు మందికి పెట్టాలి' అని లాగేసుకుంది... ఇంటి ఖర్చుకని మామయ్యగారి దగ్గరనుంచి బోలెడు వసూలు చేస్తుంది. పెద్ద కొడుకు. చిన్న కొడుకు ఎవరి డబ్బులు వాళ్ళు ఇవ్వాల్సిందే. కానీ మందుల ఖర్చు, పర్సనల్ అవసరాలు మావే. ఈఇంట్లో ఇంత డబ్బు ఇస్తూ తోటకూర పులుసు, నీళ్ళపాలు ఇంతే గతి.... అందుకే వారానికి మూడురోజులు అంతా బైట తింటారు. ఆవార ఈవార మెడికల్ బిల్లు కడతారు. ఈ మహాతల్లి పొదుపు చేస్తున్నాననుకుంటుంది. మామయ్యగారు అప్పులు చేసి ఈవిడకు ఇస్తున్నారని తెలియదు. ఆవార ఈవార ఎప్పుడో అన్నీ కాన్సర్లుగానూ, బైపాస్ సర్జరీలుగానూ బైటపడతాయి చూడు" కచ్చగా అన్నది రాధ.

కుడికాలు లోపలకి పెడుతూ 'శుభం జరగాలి' అనుకోవాల్సిన ఇంటి కోడలి గుండెల్లో నిప్పులకుంపటి........ ఈథాట్ వైబ్రేషన్ ఊరికే పోతుందా?

"ఇంట్లో ఆడవాళ్ళు పట్టించుకోకపోతే ఇలాగే చస్తాయి వ్యవహారాలు. లీటర్‌పాలు విరిగిపోయాయి..." గిన్నెలు ఎత్తి పడేస్తూ అరుస్తోంది అత్తగారు.

అంతే....... ఝుంఝూమారుతంలా ఎదురు తిరిగింది పెద్దకోడలు రాణి. సాధారణంగా వంటపనంతా నెత్తిన వేసుకునిచేసే రాణి సూటీపోటీ మాటలకు మాత్రం రెచ్చిపోతుంది. ఏమాట మాట్లాడుతోందో తెలియకుండా గిన్నె కడిగినట్లు కడిగేసింది అత్తగారితో కలిపి ఇంట్లో వాళ్ళనుకూడా. సమాధానంగా ఇంకా అరుస్తూ విరుచుకుపడి పోయింది అత్తగారు.

గభాలున పరిగెత్తి రాధ, సృజన ఆవిడను పడుకోబెట్టారు. డాక్టరును పిలిచాక మందులు, టానిక్కులకే మూడువందలైంది.

"నువ్వు ఇవ్వకు ఆవిడనే ఇవ్వనీ... ఈవిడకు ప్రతిసారీ ఇది అలవాటైపోయింది..." విసుగ్గా అన్నది పెద్దకోడలు రాణి.

ఆవిడ దృష్టిలో ఇది దాదాపు 20 పాలపాకెట్ల డబ్బు. అంత టెన్షన్‌లోనూ నవ్వొచ్చింది సృజనకు.

మామగారు క్లబ్‌కు బైలుదేరారు. చుట్టు పక్కలంతా పర్ఫ్యూం వాసన.

"అంకుల్ ఆంటీకి ఒంట్లో బాగాలేదు. మీరు క్లబ్‌కి వెళ్ళకుండా వుంటే బాగుంటుందేమో" కంగారుగా అన్నది సృజన.

చిద్విలాసంగా నవ్వాడు ఆయన.

"ఎవరికి బాగుండదు? నాకు బాగుంటుంది చాలు... ఇప్పుడు నేను క్లబ్ మానుకుని, ఈవిడ ఎదురుగా కూర్చుని.... ఈ నస వింటూ... అయినా ఆవిడ మాట చెల్లనప్పుడల్లా విరుచుకుపడిపోవడం ఆవిడకు మొదటినించీ అలవాటే. నీకు కొత్తగానీ..."

అవాక్కై నిలబడిపోయింది సృజన.

నలభైఏళ్ళుగా కాపరం చేస్తున్న వీళ్ళిద్దరి మధ్య ఉండవల్సిన స్నేహం లేదు. పైగా ఉండకూడనిది వేళ్ల ఊనింది. హాస్టాలిటీ ఒకటి . ఒకరిపొడ ఒకరికి గిట్టకపోవడం తప్పించుకుని తిరగడం బైట ప్రపంచానికి కనబడేదంతా మరి?!

"ఆవిడతో కాపురంచేసి అయిదుగురు పిల్లల్ని కన్న మహానుభావుడు. ఎంత టిప్‌టాప్‌గా డ్రస్ చేసుకుని సెంట్లు పూసుకుని కనీసం ఆవిడను పలకరించాలన్న ఇంగితమన్నా లేకుండా ఎలా వెళుతున్నాడో చూడు! ఇంక ఈయన కొడుకులకు ఎలా బుద్ధి వస్తుంది!" ఛడామడా తిడుతోంది రాణి.

ఆశ్చర్యంగా చూసింది సృజన. ఈ ఆకస్మిక అత్తగారి ప్రేమ ఏమిటా అని! ఆమెను మాట్లాడించింది.

"ఏం చెయ్యను సృజనా! నాకు రాధలా చదువు, అవకాశం ఉంటే ఎప్పుడో ఉద్యోగానికి వెళ్ళేదాన్ని... ఇద్దరు పిల్లలు... విడిగా వెళితే అద్దె, కరెంటు వీటికి బోలెడు... అందుకని ఈ ఇంట్లో మనసు చంపుకుని పడి వుంటున్నాను. నామొగుడికి నోట్లో నాలికలేదు. ఖర్చు పెట్టడం ద్వారా ఎంజాయ్ చేస్తున్నాననుకునే వ్యక్తి ఇంతమందితో పడుతున్న అత్తయ్యను చూస్తే నాకు సానుభూతి లేకకాదు. మొగుడు, పిల్లలు, పనివాళ్ళు, ఆఖరుకు మనమళ్ళకు కూడా ఆవిడ మీద ప్రేమ, సానుభూతి లేవు. కానీ... ఈసమస్యలనుంచి ఆవిడ ఏం నేర్చుకున్నది? ఏమీలేదు... మరిన్ని సమస్యలు సృష్టించుకుంటుంది. నాకు తెలిసిన గత 10 ఏళ్లుగా ఆవిడ ఏమీ మారలేదు. అదే కచ్చ నాకు..."

ఆలోచిస్తూ ఉండిపోయింది సృజన.

ఇది కుటుంబమా? జాయింట్ ఫామిలీ అని

ఎగిరేగంతేసింది తను ఒకప్పుడు... కానీ ఇది... పాముల పుట్ట... అన్నీ కలుగులే... ఎందులో చెయ్యిపెడితే ఏది కరుస్తుందోనన్న భయమే...

తల్లికి ఫోన్ చేసి గబగబా చెప్పేసింది. కానీ... చాలాచాలా చెప్పలేదు అని అర్థమైపోయింది కూడా.

అన్నీ విన్నది తల్లి... నవ్వింది.

"అమెరికాలో ఉండి ఇండియా కుటుంబవ్యవస్థ, వివాహవ్యవస్థ గురించి చాలా గొప్పగా చదివి ఇప్పుడు ఇంత అవస్థ ఏవిటి అనుకుంటున్నావా? అదిసరే... ఇందులో నీకు అర్థమైనవాటిల్లో ఎన్ని మీ ఆయనకు అర్థమయ్యాయి?!"

"ఆయనకా... పోయినవారం కాంప్ నుంచి వచ్చినప్పుడు మాట్లాడాలని ప్రయత్నించాను. కానీ... ఆయన ఈఇంట్లో పుట్టిపెరిగారు కానీ, చాలాచాలా తెలియవు. అసలు సుందర్‌కు అంటవు. ఏదో ఖర్చులేని హాస్టల్‌లో ఉన్నట్టు ఉంటాడు... ఏం జరుగుతుందో అనవసరం... అటాచ్‌మెంట్స్‌కూడా ఉన్నట్టులేవు. ఎటికసీ, మానర్సీ వల్ల అందర్నీ అంటెండ్ అవుతున్నట్టు ఉంటాడు కానీ వాళ్ళు చెపుతున్నది వినిపించుకుంటున్నాడా? అన్నది సందేహమే..."

"మరి ఆఫీసు విషయాలు!"

"అక్కడ చాలా చాలా అలెర్ట్... ఆఫీసులో ప్రతివిషయం మీదా ఇన్‌వాల్వ్‌మెంట్ ఉన్నది. నాకు వాళ్ళు జీతం, హోదా ఇచ్చి గౌరవిస్తున్నారు డామిట్! ఐయామ్ పెయిడ్ ఫర్ ఇట్ "అంటాడు.

"ఇప్పుడు అర్థమైందా సమస్య!" నిట్టూరుస్తూ అడిగింది తల్లి.

"కానీ ఇది దారుణం అమ్మా... ఇంట్లో బాధ్యతలకు కూడా జీతంలాంటిది కావాలనుకుని వాట్ ఈజ్ ఫర్ మీ? అనే పద్ధతేమిటి అసలు?"

"సుందర్ డబ్బు అడక్కపోవచ్చు... మరొకరకమైన పేమెంటు ప్రతి సామాన్యమానవుడూ ఇలాగే ఆలోచిస్తాడు. భారతదేశంలో అందరూ భగవద్గీత చదివి నిష్కామయోగంలో లేరు... మొగవాడికి ఇన్‌సెక్యూరిటీ పోగొట్టి, రిలాక్స్ చేసి, అతను ఆరోగ్యకరంగా ఆలోచించేటట్టు ఉంచేదే కుటుంబం. అలాంటి ఆలోచనలున్న ఇల్లు ఎప్పుడూ మొగవాడికి గొప్పగా కనబడుతుంది. అవిలేని ఇల్లు హాస్టల్ కిందే లెఖ్ఖ... చాలా తక్కువ ఖర్చుతో, తక్కువ ఇన్‌వాల్వ్‌మెంట్‌తో, ఎక్కువ పొంది ఎస్కేప్ అయిపోదామనుకుంటాడు. ఇది అక్షరాలతో రాయని చట్టం..." తల్లిఫోన్ పెట్టేసింది.

ఆలోచిస్తోంది సృజన... తనైతే ఎలాగూ విడి కాపరానికి వెళ్ళిపోతుంది. కానీ ఇదే లక్షణాలున్న మిగతా ముగ్గురు మొగవాళ్ల భార్యలు... రాణక్క, రాధక్క, తన అత్తగారు వీళ్ళు ఇలా కొట్టుకుంటూ, కాంప్లెక్సులతో, మరింత కుంచుకుపోయి ఎలా రిలాక్స్ అవ్వాలో తెలియక ఎప్పుడో మామగారి శారీరక మానసిక అనారోగ్యాలు బైటపడి... మరొక పదేళ్ళల్లో పెద్ద హోదాలో వున్న కుటుంబం అంచలంచలుగా స్థాయి తప్పడం ఇప్పుడే కనబడుతోంది సృజనకు.

మామగారు హాల్లో గట్టిగా ఫోన్లో మాట్లాడుతున్నారు. బిల్ క్లింటన్ వచ్చాడుగా.... కోట్ల డాలర్ల ప్రామిస్ చేశాడటగా... ఓహో రఘుపతి డిపార్ట్‌మెంట్ దండుకోవడం... మన ఉద్యోగాలూ ఉన్నాయి... ఎందుకు! దోసిడుకు ఎరవేస్తే పిడికెడు రాలుతుంది. ఛీ... ఛీ మనం బిల్‌క్లింటన్ కన్నా గుఱ్ఱాల్ని నమ్ముకోవడం మంచిది. భాయీ... దేశం ఎట్లా, ఏనట్టేట్లో కలిస్తే మనకెందుకు చెప్పు..." గట్టిగా నవ్వుతున్నారు.

"దిక్కుమాలిన గుఱ్ఱప్పందేలు... ఆ గుఱ్ఱాల్తో వీళ్ళు కిష్టలోపడి కొట్టుకుపోతే కానీ పీడా విరగడవదు..." తిట్టుకుంటూనే అలవాటుకొద్దీ మంగళసూత్రాలు కళ్ళకు అద్దుకుంటూ పళ్ళుకొరుకుతోంది అత్తగారు... అది ఆచారం... అంతే....... అర్థంలేదు వేటికీ....

నవ్వుకున్నది సృజన... ఏం మనుషులు వీళ్ళు?! మామగారిలాంటి ఆఫీసరు, అత్తగారిలాంటి కుటుంబపెద్ద ఉంటే ఏం మంచి జరుగుతుంది? సత్‌సంకల్పానికి, సహాయం కావలసిన వర్గానికి మధ్యలో ఒక వారధిలాంటి వర్గం వై మీ? నేనే ఎందుకు చెయ్యాలి? వాట్ ఫర్ మీ? నాకేంటి లాభం... వాట్ డూ ఐ కేర్? ఎవరు ఎలా పోతే నాకేం? అన్న ప్రశ్నలు వేసుకుని ఏమంచి విషయాన్నీ జరగనీయకుండా ఆపేస్తోంది... ఇదేమిటి? అని ప్రశ్నించలేని రక్షణ కవచం సాంప్రదాయం ముసుగులో మరింతమంది బాధితుల్ని తయారుచేస్తోంది.

తల్లి ఫోను...

"ఏవిటి? సమస్యలతో బుఱ్ఱ పగిలిపోతోందా?! ఎట్నించి ఆలోచించాలో తెలిసిందా?!"

"లేదు..."

"అది సరే... నీ కజిన్ రమకు సంబంధం వచ్చింది..."

"ఎవరమ్మా?"

"అబ్బాయి ఇంజనీరు... అందగాడు... మంచి కుటుంబం... తండ్రి పెద్ద హోదాలో ఉన్నాడు... నలుగురు కొడుకులు... ఇతడు ఆఖరివాడు... కళకళలాడే ఉమ్మడి కుటుంబం... వాళ్ళ అత్తగారు చాలా జాగ్రత్త, పద్ధతి, ఆచార వ్యవహారాలు తెలిసిన మనిషి... కోడళ్ళను ప్రేమగా, బాధ్యతగా చూసుకుంటోంది. వాళ్ళు ఎప్పుడూ సరదాగా హోటళ్ళు, పిక్నిక్‌కి వెళుతూ ఉంటారుట. సామాన్యమైన ఆడపిల్ల డ్రీం హౌస్ అనుకో...."

"నిజమా అమ్మా! నువ్వు చూశావా వాళ్ళని? రమ చాలా చాలా అదృష్టవంతురాలు".


"ఇండియాలో ఉన్నా, అమెరికాలో ఉన్నా ఆడపిల్ల అమాయకత్వం అంటే ఇదే..." తేల్చి చెప్పింది తల్లి.

"అదేమిటమ్మా!"

"అబ్బాయి ఎవరో తెలుసా? నీ మరిది రఘు. మీ అత్తగారి నాలుగో కొడుకు పూనాలో ఉన్నాడు. ఈ వర్ణన అంతా మీ కుటుంబం గురించే. బైట మాయకు, లోపలి ఓటితనానికి అంత తేడా ఉన్నది. మీ ఆడపిల్లలకు మీరేమిటో మీకు ఏం కావాలో, మనుష్యుల్ని ఎలా చూడాలో తెలుసుకోనంతకాలం ఈకథలు ఇంతే..."

ఫోన్ పెట్టేసింది తల్లి.

అవాక్కై నిలబడిపోయింది సృజన. ❋



## ఇది లోకంతీరు

ఆ మధ్య దర్శకుడు ఇంద్ర కుమార్ చిత్ర కథ డిస్కషన్స్‌లో పాల్గొన్నప్పుడు, నాకు తోచిన కొన్ని సలహాలను దర్శకుడికి చెప్పాను.

నా సూచనలు బాగున్నాయని, వాటిని తప్పకుండా కథనంలో చేర్చుతానని అన్నారు. అయితే ఆశ్చర్యంగా, ఆ తరువాత బాలివుడ్‌లో, నేను అతిగా అన్ని విషయాల్లోనూ కల్పించుకుంటున్నట్లు, ఇంద్రకుమార్ తన చిత్రంలో నా బదులు వేరే అమ్మాయిని తీసుకునే ఉద్దేశ్యంలో వున్నట్లు పత్రికల్లో చదివి ఆశ్చర్యపోయాను అంది పాపం అందాల సుందరి ఐశ్వర్యా రాయ్.